# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-09-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రకాశం బ్యారేజీ గేట్లను పడవలు ఢీకొన్న ఘటనపై ప్రభుత్వం విచారణ జరుపుతోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.**

2. **వరద ముంపు ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితులపై ఈ రోజు నుంచి ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.**

3. **వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.**

4. **వరదల కారణంగా నష్టపోయిన వాహనాలు, ఆస్తులకు సంబంధించిన భీమాను పొందేందుకు విజయవాడ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది.**

5. **వరదల ప్రభావిత ప్రాంతాల ప్రజలను ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్ధ సారథి తెలిపారు.**

===========================

ప్రకాశం బ్యారేజీ గేట్లను పడవలు ఢీకొన్న ఘటనపై ప్రభుత్వం విచారణ జరుపుతోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. విజయవాడలో మంత్రి ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, వరద ప్రవాహంలో కోట్టుకు వచ్చిన పడవలు ప్రకాశం బ్యారేజీ గేట్లను ఢీ కొట్టాయని తెలిపారు. అవి గేట్లకు ఉండే కౌంటర్ వెయిట్‌లకు కాకుండా బ్యారేజీ పిల్లర్లను బలంగా ఢీకొడితే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండేదని మంత్రి తెలుపుతూ,

వాయిస్ (37 సెకన్లు)

--------------------------

విజయవాడలోని వరద ముంపు ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితులపై ఈ రోజు నుంచి ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. సర్వే సన్నద్ధతలో భాగంగా వైద్య సిబ్బందికి నిన్న విజయవాడలో నిర్వహించిన శిక్షణా కార్య క్రమంలో ఆయన మాట్లాడారు. 4 రోజుల పాటు చేపట్టనున్న ఈ సర్వే కోసం 150 వైద్య బృందాల్ని నియమించినట్లు చెప్పారు. 32 వార్డుల్లోని 149 వార్డు సచివాలయ కేంద్రాలలో ఈ సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి కమ్యూనిటీ ఆరోగ్య అధికారి 4 రోజుల్లో 300-400 కుటుంబాల్లోని సభ్యుల ఆరోగ్య వివరాల్ని సేకరిస్తారని వివరించారు. ఆయా ప్రాంతాల్లో వ్యాధి తీవ్రతను బట్టి వైద్యాధికారులు చర్యలు చేపడతారని మంత్రి తెలిపారు

--------------------------

వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అనకాపల్లి జిల్లాలోని తాండవ జలాశయంలో నీటిమట్టం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. రెండు గేట్లు ఎత్తి 600 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. దీంతో అధికారులు లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేశారు. ఉప్పరగూడెం-గన్నవరం మెట్ట గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలం చట్రాయిపల్లి వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. శిథిలాల కింద చిక్కుకున్న నలుగురిని అధికారులు రక్షించారు. జిల్లాలోని ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్రాను కలిపే అంతర్రాష్ట్ర రహదారిలో.. నర్సీపట్నం-భద్రాచలం రహదారిపై కొండచరియలు విరిగిపడటంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయని అధికారులు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం బుడతవలస నుంచి బెజ్జిపురం వెళ్లే దారి మధ్యలో సెట్టిగెడ్డ వాగుకు వరద ఉద్ధృతి పెరగడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి.

---------------------------

భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన వాహనాలు, నివాసాలు, దుకాణాలు తదితర ఆస్తులకు సంబంధించిన భీమాను పొందేందుకు విజయవాడ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కేంద్రంలో అన్ని రకాల బీమా కంపెనీల ప్రతినిధులు ఈ రోజు నుంచి అందుబాటులో ఉంటారని పేర్కొంది. భీమా చేసుకున్న ఆస్తులు నష్టపోయిన, దెబ్బతిన్నవారు ఈ సేవలను ఉపయోగించుకోవాలని ప్రభుత్వం సూచించింది.

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో పాటు విజయవాడ వరద పరిస్థితులపై గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. విజయవాడ రాజ్‌భవన్‌లో ముఖ్యమంత్రి గవర్నర్‌ను కలిసి బాధితులను ఆదుకునేందుకు అధికార యంత్రాంగం చేపట్టిన సహాయ పునరావాస చర్యలను వివరించారు. సహాయక చర్యలను క్షేత్రస్థాయిలో ఉండి పర్యవేక్షించడం పట్ల ముఖ్యమంత్రిని గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. త్వరలోనే సాధారణ పరిస్థితులు నెలకొంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

---------------------------

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి -సీపీసీబీ దేశవ్యాప్తంగా నిర్వహించిన స్వచ్ఛ వాయు సర్వేక్షణ్-2024లో రాష్ట్రం నుంచి 10 లక్షల జనాభా పైబడిన నగరాల్లో విజయవాడ 9, విశాఖపట్నం 26వ స్థానంలో నిలిచాయని అధికారులు తెలిపారు. గాలిలో ధూళికణాల సంఖ్య ఆధారంగా నగరాల పని తీరును లెక్కించి ఈ ర్యాంకులు ప్రకటించారు. 3 నుంచి 10 లక్షల జనాభా ఉన్న 43 నగరాల్లో గుంటూరు 10, రాజమహేంద్రవరం 17, నెల్లూరు 19, కర్నూలు 23, కడప 25, అనంతపురం 33వ స్థానాల్లో నిలిచాయి. అలాగే 3 లక్షల లోపు జనాభా ఉన్న 40 పట్టణాల్లో ఒంగోలు 17, చిత్తూరు 21, శ్రీకాకుళం 22, విజయనగరం 24వ స్థానాల్లో నిలిచాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ- ఏపీఎస్‌ఆర్టీసీ బలోపేతం దిశగా త్వరలో ఎలక్ట్రిక్ బస్సు సర్వీసులు అందుబాటులోకి తెస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం డిపో నుంచి ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లోని ఆయా డిపోలకు కేటాయించిన 23 కొత్త బస్సులను మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కొత్తగా 1,400 బస్సులను ప్రభుత్వం కొనుగోలు చేసిందని, వాటిలో 600 బస్సులను ప్రారంభించామని తెలిపారు. మూడు నెలల్లో మిగిలిన వాటినీ ప్రారంభిస్తామన్నారు. ఆర్టీసీ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి

తెలిపారు.

---------------------------

వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో మంత్రి ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, ముంపు ప్రాంతాల్లో వరద బాధితులకు ఆహారాన్ని అందించేలా సాంకేతికను వినియోగిస్తున్నామని చెప్పారు. మారుమూల ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా ఆహారం సరఫరా చేస్తున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ (29 సెకన్లు)

---------------------------

ప్రతి బాధితుడికి న్యాయం జరిగేలా వాస్తవ గణాంకాలు నమోదు చేయాలని రెవిన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్.పి.సిసోడియా అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో వరద ముంపు నష్టాల నమోదుపై సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ, విజయవాడ నగరం, గ్రామీణ ప్రాంతంలోని 170 సచివాలయాల పరిధిలో 2.30 లక్షల నివాసాలు వరద వల్ల నష్టపోయినట్లు తెలిపారు. విజయవాడ రూరల్ మండలంలోని ఐదు గ్రామాల్లో నష్టం సంభవించిందని పేర్కొన్నారు. మొత్తం సమాచారాన్ని బాధితుల సమక్షంలోనే ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేయాలని సూచించారు.

---------------------------

వాయుగుండం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాల్లో ఈరోజు భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ సూచించిన క్రమంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ అధికారులను ఆదేశించారు. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సంస్థ పరిధిలోని 11 జిల్లాల అధికారులను అప్రమత్తం చేసారు. వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయాలు లేకుండా సేవలందించేందుకు అవసరమైన యంత్రాంగాన్ని, పరికరాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని వినియోగదారులు టోల్ ఫ్రీ నంబర్ 1912కు తెలియచేసి పరిష్కారం పొందవచ్చని సూచించారు.

---------------------------

ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ 2025 అవార్డుల కోసం దరఖాస్తులను ఈ నెల 15 వ తేది వరకు సమర్పించవచ్చని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. డిసెంబర్ 26న వీర్ బల్ దివాస్ సందర్భంగా బాలల శక్తి సామర్థ్యాలు, సంకల్పం, ఉత్సాహాన్ని గుర్తించి ప్రోత్సహించేందుకు ఈ అవార్డులను అందజేస్తారు. రాష్ట్రీయ పురస్కార్ అధికారిక వెబ్ సైట్ లో 5 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు నుంచి 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న బాలలు దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రిత్వ శాఖ తెలిపింది.

=====================